క్లుప్తంగా

వెంకటేశ్వస్వామి కల్యాణం

ఉండి: మండలంలోని శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమం లోని రాధామధనమోహనస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గోపూజ, కల్యాణోత్సవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం హాజరైన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సదుపాయాలు కల్పించాలి

సాక్షి, భీమవరం: జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ కోరారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు జగనన్న కాలనీలు మునిగిపోయాయన్నారు. ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, వరదలకు నష్టపోయిన రైతులను, కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు.

రొయ్యల రైతుల సంక్షేమానికి కృషి


సమావేశం నిర్వహిస్తున్న రొయ్యల రైతులు

వీరవాసరం: రొయ్యల రైతుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు రొయ్యల రైతుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు తెలిపారు. వీరవాసరం తులసి కన్వెన్షన్ సెంటర్లో బుధవారం నిర్వహించిన రొయ్యల రైతుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్వా సబ్సిడీ, రొయ్యల ధరకు గిట్టుబాటు ధర తదితర విషయాలపై ప్రభుత్వం ఆక్వా రైతులకు బాసటగా నిలుస్తుందన్నారు. సీడ్, ఫీడ్, మెడిసిన్ వంటి పలు అంశాలపై ఆయా యాజమాన్యాలతో విజయవాడలో ఐదో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. రొయ్య రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డే రఘురాంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో వీరవాసం మండల సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్ల తులసి రాంబాబు, తోట బుజ్జి, భోగి రెడ్డి శ్రీనివాస్, గంధం కేసు బాబు, నాగరాజు వెంకట గోపాలకృష్ణరాజు, ఎరక రాజు వెంకట గోపాలకృష్ణం రాజు, అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, వన్నం రెడ్డి సుబ్రహ్మణ్యం, తాడాల దుర్గా వరప్రసాద్, దాసరి మాణిక్యాలరావు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

భీమవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై బి.మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్ప గ్రామానికి చెందిన నడకుదటి వెంకటేశ్వరరావు (62), అదే గ్రామానికి చెందిన జల్లా సత్యనారాయణ గత నెల 21న సార్వా పంట నారుతీతకు ఆకివీడు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా బరువానిపేట వద్ద రోడ్డుపై ఆవు అడ్డురావడంతో పడిపోయారు. వెంకటేశ్వరరావు తలకు బలమైన గాయం కావడంతో భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించి వెంకటేశ్వరరావు మృతిచెందాడు. వెంకటేశ్వరరావు కుమారుడు నడకుదటి శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

21లోగా ఓటర్ల సర్వే పూర్తిచేయాలి

సాక్షి, భీమవరం: ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి చేపట్టిన సర్వేను ఈనెల 21లోగా పూర్తి చేయాలని ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నియోజవర్గ బీఎల్వోలతో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. జాబితాలో తప్పులను సరిచేయాలన్నారు. జనసేన మినహా మిగిలిన రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఓలు పాల్గొన్నారు. వలంటీర్లు హాజరు కాకుండా చూడాలని ఆర్డీఓ సూచించారు.

గ్యాస్ సిలిండర్ల చోరీపై కేసు

భీమవరం అర్బన్: గ్యాస్ సిలిండర్ల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రావు తెలిపారు. దిరుసుమర్రు గ్రామంలో దండు సుబ్బరాజు అనారోగ్యంతో చికిత్సకోసం హైదరాబాద్ వెళ్లారని ఇంటి బాధ్యతలు ఆయన సోదరుని కుమారుడు సుబ్రహ్మణ్యేశ్వరరాజుకు అప్పగించారని చెప్పారు. ఆయన గత నెల 31న ఇళ్లు పరిశీలించగా అరుగుపై ఉండాల్సిన రెండు గ్యాస్ సిలిండర్లు చోరీకి గురయినట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్.. సేవలు భేష్

- ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు
- 104 వాహనాల్లో 14 రకాల సేవలు
- అందుబాటులో 67 రకాల మందులు
- ప్రజల్లో సంతృప్తి


కొమరాడలో రోగికి వైద్యం అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధనలక్ష్మి

భీమవరం అర్బన్: విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా అభివృద్ధి చేస్తూ.. నూతన ఒరవడికి నాంది పలికింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు అమలు చేస్తోన్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మంచి ఫలితాలనిస్తోంది. ప్రజలకు నాణ్యమైన వైద్యం ఇంటి వద్దే అందుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా రోగులు కోలుకునే విధంగా చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సేవలు భేష్

భీమవరం మండలం తుందుర్రు, గొల్లవానితిప్ప గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని 25 గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో రెండు 104 వాహనాల ద్వారా నెలకు రెండు సార్లు ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, జనరల్ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటి వద్దే 104 వాహనంలోని మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యులు సూచనల మేరకు రక్త పరీక్షలు చేస్తున్నారు. బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 67 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ప్రభుత్వ శస్త్ర చికిత్సల అనంతరం బాధితుడి పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సూచనలిస్తున్నారు.

కార్పొరేట్ వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు రూ.కోట్లు ఖర్చుచేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కార్పొరేట్ వైద్యం ప్రతిఒక్కరికీ చేరువవుతోంది. సుమారు 3,600 పైగా వైద్య సేవలను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకొచ్చారు. పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్య సేవలు పొందే అవకాశం కల్పించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

మండలంలో కేసులు ఇలా..

హైపర్ టెన్షన్ :	25,092
డయాబీటీస్ :	12,837
హైపర్ టెన్షన్, డయాబీటిక్ :	21,379
గర్భిణులు :	6,801
బాలింతలు :	4,378
క్యాన్సర్ :	148
ఆరోగ్య డిశ్చార్జ్‌డ్ :	654

ఇంటి వద్దే వైద్యం



గతంలో కొడుకో, మనమల్లోనో తీసుకుని ఆస్పత్రికి వెళ్తే దాన్ని. వాళ్లు ఖాళీ లేకపోతే అంతే సంగతులు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్యులు ఇంటికే వచ్చి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఎక్కడికీ వెళ్లకుండా ఇంటివద్దే వైద్య సదుపాయాలు అందిస్తున్నారు.

– సంధి విజయమణి, బ్రెస్ట్ క్యాన్సర్ రోగి, చినఅమిరం

పకడ్బందీగా అమలు



నెలలో రెండు సార్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించి 104 వాహనాల ల్యాబ్‌లలో రక్త పరీక్షలు చేస్తున్నాం. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తున్నాం. అంగన్‌వాడీ, స్కూళ్లలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

– సీహెచ్ ధనలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, గొల్లవానితిప్ప

ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్‌కు హెల్ప్‌లైన్ సెంటర్


వర్క్‌షాప్ పోస్టర్ విడుదల చేసిన దృశ్యం

సాక్షి, భీమవరం: ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ నమోదుకు స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ నమోదులో విద్యార్థులు తమ ఇష్టమైన గ్రూపులు, చేరాలనుకున్న కళాశాలలు సక్రమంగా నమోదు చేసుకునేందుకు అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న వర్క్‌షాప్

ఎస్ఆర్‌కేఆర్ కళాశాల ఆధ్వర్యంలో ఉన్నత విద్యా సంస్థల్లోని ఇంగ్లిష్ అధ్యాపకులకు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ఈనెల 11న వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జగపతిరాజు తెలిపారు. ప్రధానంగా అంతర్జాతీయ విద్యాసంస్థల్లో చేరేందుకు నిర్వహించే టోఫెల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంగ్లిషులో శిక్షణ అందించేందుకు వర్క్‌షాప్‌లో అధ్యాపకులకు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం వర్క్‌షాప్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, కోఆర్డినేటర్ నడింపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీఎల్ పరామర్శ


గొరగనమూడిలో విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు బుధవారం గొరగనమూడిలో రవిబాబు కుటుంబాన్ని పరామర్శించారు. రవిబాబుని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈయన వెంట విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, ఎంపీటీసీలు బొల్లం గాంధీ, పేరం శ్రీను, దిడ్ల రవి తదితరులు ఉన్నారు.

జూద స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని యండగండి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,800 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న పీవీఎల్, తదితరులు

కాళ్ల: అన్ని వర్గాలకు మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనను ఆశీర్వదించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఏ పథకం నిలుపుదల చేయలేదన్నారు. కాపులను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసారని ఎద్దేవా చేశారు. కానీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కాపు నేస్తం ద్వారా కాపులను అక్కున చేర్చుకుని అన్ని విధాల ఆదుకున్నారని గుర్తు చేశారు. ఏలూరుపాడు గ్రామంలో ఏ ఇంటికి వెళ్లిన కాపు కుటుంబాలు జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాల ఆదుకున్నారని చెప్పటమే దానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏ ఎన్నికలు లేనప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయో లేదో అని తెలుసుకోవడానికి మా నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి మమ్మల్ని ప్రతి గడపకు పంపుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికీ సుమారు 80% పైబడి ఇల్లు సందర్శించామన్నారు. ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలు పొందుతూ ఆనందంగా ఉన్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, గ్రామ ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, మంతెన రామకృష్ణారాజు, దాట్ల బాపిరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, కటారి లక్ష్మీపతి రాజు, బండ్రెడ్డి ఆది, పడమట సుబ్బయ్య, పడమట సతీష్, దాట్ల రామభద్రిరాజు, కొండా రమణ, పెన్మెత్స రంగరాజు, కోనా రంజిత్ , సిహెచ్ అశోక్ జేమ్స్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాము సంచారంతో భయాందోళన


నర్సయ్య అగ్రహారం కేబిన్ రోడ్డు నివాసిత ప్రాంతంలో సంచరిస్తున్న పాము

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక నర్సయ్య అగ్రహారం కేబిన్ రోడ్డులోని నివాస ప్రాంతంలో గత మూడు రోజులుగా 10 అడుగులు పాము సంచరిస్తోందని, ఇళ్లలోకి కూడా వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాము సంచరించడంతో పిల్లలు బయటకు పంపేందుకు భయంగా ఉందని మహిళలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పామును పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధిలో బాటలో గొల్లవానితిప్ప

మగనుగడ కోసమే జనసేన కుట్రలు


జనసేన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు

భీమవరం అర్బన్: గొల్లవానితిప్ప గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోందని, ఎన్నికలు దగ్గరపడుతుండటంతో జనసేన పార్టీ మనుగడ కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతోందని సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్ధాల రామకృష్ణ, లబ్ధిదారులు ఆరోపించారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో 18 ఎకరాల్లోని జగనన్న కాలనీలో బుధవారం వెంకటేష్, రామకృష్ణ మాట్లాడారు. జనసేన నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో కాలనీలో విద్యుత్, తాగునీరు, డ్రైయినేజీలు, రోడ్లు ఏర్పాటుచేయకపోవడంతో కనీసం 20 ఇళ్లు కూడా లబ్ధిదారులు నిర్మించుకోలేదని గుర్తుచేశారు. 2019లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో లబ్ధిదారులు కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారని, మరి కొందరులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని చెప్పారు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నారని, కాలనీ మెయిన్ రోడ్డుకు రూ.22 లక్షలు, పైపులైన్ సంపునకు రూ.10 లక్షలు, విద్యుత్‌కు రూ.30 లక్షలు, అంతర్గత రోడ్లకు రూ.65 లక్షలు, సచివాలయానికి రూ.25 లక్షలు, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.కోటి 46 లక్షలు వెచ్చించి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. అభివృద్ధికి సహకరించని జనసేన నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. టీడీపీ హయాంలో జనసేన నాయకులు ఏమైపోయారంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో గుద్దటి సత్యనారాయణ, గంటా సత్యనారాయణ (శ్రీను), రామాయణం కృష్ణస్వామి, ఉండవల్లి విశ్వేశ్వరరావు, లబ్ధిదారులు చాబత్తుల లక్ష్మి, వల్లభనేని సీత తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష


పార్టీ పెదఅమిరం కార్యాలయంలో మాట్లాడుతున్న పీవీఎల్ నరసింహారాజు

కాళ్ల: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశ్యమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి 95% సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మిగిలిన వారికి కూడా పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించాలని సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు రైతులకు, ప్రజలకు కనివిని ఎరుగని రీతిలో అందించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఈ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి ప్రజలకు నెల రోజుల్లో అనేక రకాల ప్రయోజనాలు చేకూర్చారని తెలిపారు. జగనన్న సురక్ష పథకం ప్రజలకు శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రికార్డు స్థాయిలో సక్సెస్ అయ్యిందని ధీమా వ్యక్తం చేశారు.నియోజకవర్గంలో 91 వేల మందికి సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంను విజయవంతం చేసేందుకు కృషి చేసిన అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, అందరికీ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఆకివీడు జెడ్పీటీసీ వేగేశ్న వెంకటరాజు, ఎంపీపీలు పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, కటారి విజయలక్ష్మి, ఆకివీడు మున్సిపాలిటీ చైర్మన్ జామి హైమావతి, మండల కన్వీనర్లు పెన్మెత్స ఆంజనేయరాజు, గుండుగొలను ధనరాజు, కటిక శ్రీదేవి, గుండా సుందరరామ నాయుడులు పార్టీనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


ఉండిలో పింగళి వెంకయ్య జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: పింగళి వెంకయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వీవీ గిరి ప్రభుత్వ ఆర్ట్ కళాశాలలో పింగళి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి దేశ భక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఆనందకుమార్, కె.బాల గురవయ్య, ఎస్.జ్యోతి, యూ.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉండిలో పింగళి వెంకయ్య జయంతి

ఉండి: స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలను బుధవారం ఉండిలో ఘనంగా నిర్వహించారు. ఉండిలో పింగళి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో సన్నిధిరాజు కృష్ణ, దేవరకొండ రాము, మాసాబత్తుల రామకృష్ణ, తాడేపల్లి కిరణ్, ఏలూరిపాటి ఫణి తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య జయంతి

పాలకోడేరు: జాతీయ పతాక రూపకర్త, దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప దేశభక్తి కలిగిన జాతీయ నాయకుడు పింగళి వెంకయ్య పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని బుధవారం గరగపర్రు గ్రామంలో గాయత్రి విశ్వకర్మ పంచ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంతెన సత్యనారాయణ రాజు, చింతలపాటి బలరామరాజు, మంతెన రామరాజు, చింతలపాటి సూర్యనారాయణ రాజు, వత్సవాయి రామరాజు, పిరిడి రమేష్ , కడియం వెంకన్న , అంకాలు, పాలా రాధాకృష్ణ గరగపర్రు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పింగళికి ఘనంగా నివాళి

సాక్షి, భీమవరం: పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెంకయ్యకు ఘనంగా నివాళులర్పించారు. భీమవరం వన్ టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీవర్మ, హరిసింగ్, అరసవల్లి మణికంఠ వెంకటేష్, జవ్వాది దాశరధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్లది కీలకపాత్ర


విద్యార్థులకు నమూనా చెక్కు అందించిన దృశ్యం

సాక్షి, భీమవరం: సమాజాభివృద్ధిలో సివిల్ ఇంజినీర్లు కీలకపాత్ర పోషిస్తారని ట్రాన్స్‌హైట్ కన్సల్టెంట్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీర బిరాదార్ అన్నారు. స్థానిక శ్రీవిష్ణు ఇంజినీరింగ్ మహిళా కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం యనమదుర్రు క్యాంపస్‌లో నిర్వహించిన జాతీయ కాంక్రీట్ కానో పోటీ (ఏసీసీసీ)లను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పెరుగుతోన్న జనాభాకు మౌలిక అవసరాలను పరిష్కరించడంలో సివిల్ ఇంజినీర్లు ప్రముఖపాత్ర పోషిస్తారన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో స్త్రీ, పురుషులకు సమానవకాశాలున్నప్పటికీ రాబోయే రోజుల్లో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ సంస్థలు మహిళా సివిల్ ఇంజినీర్లను మరింత ప్రోత్సహించే అవకాశముందని బిరాదార్ స్పష్టం చేశారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ఆర్ రవిచంద్రన్ మాట్లాడుతూ ఏసీసీసీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కాంక్రీట్ మిక్స్ డిజైన్‌లు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సవాళ్లతో వారి నైపుణ్యాలను పరీక్షించేటప్పుడు ఆచరణాత్మక అనుభవాన్ని పొందే ఏకైక అవకాశాన్ని అందించడమే కాకుండా తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకునే ఇంజినీరింగ్ సూత్రాల ఆచరణాత్మక అన్వయాన్ని కూడా అందిస్తుందని చెప్పారు. ఈ పోటీలను దేశవ్యాప్తంగా 16 విద్యా సంస్థల విద్యార్థులు తిలకించారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన విష్ణు కళాశాల విద్యార్థులకు రూ.40 వేలు నమూనా చెక్కును బహుమతిగా అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ పి.గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితాల్లో మార్పులు

వీరవాసరం: ఓటర్ లిస్టులోని మార్పులను పారదర్శంగా నిర్వహించాలని ఆర్డీఓ దాసిరాజు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఓటర్ లిస్టులో కొత్తగా పెళ్లయిన అమ్మాయిలను, చనిపోయిన వ్యక్తులను, ఓటర్ లిస్ట్ నుంచి తొలగించాలని సూచించారు. వాటర్ లిస్టుల సర్వే సక్రమంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ ఎం సుందర్ రాజు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, సురేష్ పాల్గొన్నారు.

ఇళ్లు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

భీమవరం అర్బన్: ఇళ్లు ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దిరుసుమర్రు చినపేటకు చెందిన చిగురుపాటి రోహేల్, తల్లి, పిల్లలతో ఇంట్లో ఉండగా ఈ నెల 1న పాసుకుర ఫాయేల్ ఇంటి బయట అరుస్తూ గునపంతో అరుగు, వంటింటిపై రేకులు ధ్వంసం చేశాడు. రోహేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

సరళమైన సార్వత్రిక విద్య


సార్వత్రిక విద్యా విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆకివీడు: ప్రతీ వ్యక్తి చదువుకోవాలనే ఆశయంతో ప్రభుత్వం సార్వత్రిక విద్యను మరింత సులభతరం చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్వీ రమణ చెప్పారు. సార్వత్రిక విద్యా విధానంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడికి వెళ్లని బడిఈడు పిల్లలతో పాటు, చదువు మధ్యలో మానివేసిన వారికి, పదో తరగతి ఉత్తీర్ణత కాని విద్యార్థులకు నూతన విధానం సువర్ణావకాశాన్ని కల్పిస్తుందని చెప్పారు. వలంటీర్లు, ఆశావర్కర్లు, ఆటో, ట్యాక్సీడ్రైవర్లు, ఇతర వాహన డ్రైవర్లు, ఇతరులు పది, ఇంటర్ చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ వివరించారు. అప్సోస్ జిల్లా అధికారి నారాయణ మాట్లాడుతూ 14 ఏళ్లు నిండిన ప్రతీ వ్యక్తి పది చదివేందుకు అర్హులేనన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి, ప్రజా ప్రతినిధులకు, చిరు ఉద్యోగులు, వ్యాపారులకు నూతన విద్యా విధానంతో మంచి అవకాశం కల్పించిందని చెప్పారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీ, దివ్యాంగులకు మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రాయితీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కందుల వాణీ, నగర పంచాయతీ కమిషనర్ జీ. కృష్ణ మోహన్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, అరవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.